సాక్షి సిద్దిపేట

సోమవారం ׀ 30 ׀ డిసెంబర్ ׀ 2024



పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న అర్చకులు



నిర్వహిస్తున్న కల్యాణ క్రతువు..



స్వామివారి కల్యాణం వీక్షిస్తూ తన్మయత్వంతో నమస్కరిస్తున్న భక్తులు

కల్యాణం.. వైభోగం

కనులపండువగా మల్లన్న లగ్గం

- తిలకించి పులకించిన భక్తజనం
- శివనామస్మరణతో మారుమోగిన కొమురవెల్లి

కొమురవెల్లి(సిద్దిపేట): భక్తుల జయజయధ్వానాలు.. వీరశైవపండితుల మంత్రోచ్చరణలు.. మేళతాళాలు.. మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లికార్జునస్వామితో కేతలమ్మ, మేడలమ్మల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణవేదికపై ఆదివారం నభూతో నభవిష్యత్తు అన్న చందంగా కమనీయంగా, రమణీయంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. వేడుకలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు తరలివచ్చారు. ప్రభుత్వం తరఫున మల్లికార్జున స్వామికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులు సమర్పించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఆగమ శాస్త్రం ప్రకారం..

వీర శైవ ఆగమ శాస్త్ర ప్రకారం మహాదేవుని, పడిగన్నగారి వంశస్తుల ఇళ్ల నుంచి పట్టు వస్త్రాలు, పుస్తె మెట్టెలు, ముత్యాల తలంబ్రాలు, ఒడిబియ్యంను ఊరేగింపుగా వేదికకు తీసుకువచ్చారు. దీంతో మల్లన్న కళ్యాణవేడుకలు మొదలయ్యాయి. కల్యాణాన్ని కాశీ పీఠాధిపతి జగద్గురు మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. మధ్యాహ్నం 12.28గంటలకు మల్లికార్జున స్వామి బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మలను పరిణయమాడారు. మూడు గంటల పాటు కల్యాణ క్రతువు కనులపండువగా సాగింది.

కనులపండువగా రథోత్సవం

మల్లన్న కల్యాణం అనంతరం సాయంత్రం స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేడు పోలీసు కమిషనర్ అనురాధతో 'సాక్షి' ఫోన్ ఇన్





సిద్దిపేటకమాన్: నూతన సంవత్సర వేడుకలకు యువతి, యువకులతో పాటు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు నూతన సంవత్సర వేడుకల్లో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, ఈవెంట్ల నిర్వహణ అనుమతి, జిల్లా కేంద్రంతో పాటు కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ, ట్రాఫిక్ ఆంక్షలు, ఇతర నిబంధనలు, అంశాలపై మీకు అనుమానాలు, సందేహాలను నేరుగా సిద్దిపేట పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'సాక్షి' మీకు కల్పించింది. సోమవారం సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో కమిషనర్‌తో మాట్లాడి విషయాన్ని నేరుగా తెలుసుకోవచ్చు.

సోమవారం
సమయం: మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు

ఫోన్ చేయాల్సిన ఫోన్ నంబర్

87126 67306

ప్రగతి అంతంతే..!

హుస్నాబాద్‌లో జోరు సిద్దిపేటలో బేజారు..

- గృహజ్యోతి ద్వారా రూ.58కోట్ల లబ్ధి
- గ్యాస్ సిలిండర్ల కోసం రూ 14.53కోట్లు చెల్లింపు
- మూడు విడతల్లో రూ.843 కోట్ల రైతు రుణ మాఫీ



సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించారు. మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలకు గతంలో కేటాయించిన నిధులు రద్దు చేయడమేకాక.. ఈసారి తక్కువ మొత్తంలో మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, గృహలక్ష్మి, రూ.500లకు గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులు అందుకుంటున్నారు. ఇప్పటివరకు రూ.938 కోట్ల రైతు రుణమాఫీ జరిగింది. కలెక్టర్‌గా పని చేసిన ప్రశాంత్ జీవన్ పాటిల్ నీటిపారుదల శాఖకు బదిలీ కాగా ఫిబ్రవరి 24న మిక్కిలినేని మనుచౌదరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

రూ.843 కోట్ల రుణ మాఫీ

ఒక్క కుటుంబానికి రూ.2లక్షల రైతు రుణమాఫీని ప్రభుత్వం అమలు చేసింది. జిల్లా వ్యాప్తంగా మూడు విడతల్లో 1,02,323 బ్యాంక్ ఖాతాలకు రూ.843.05 కోట్లను రుణమాఫీని ప్రభుత్వం చేసింది. నాల్గో విడత డిసెంబర్ మొదటి వారంలో 9,063 బ్యాంక్ ఖాతాలకు రూ.95.25 కోట్ల రుణమాఫీ అవుతుందని ప్రభుత్వం ప్రకటించగా అందులో కొందరికే అయింది. మిగతా రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొందరు రైతులకు వివిధ సమస్యలతో రైతు రుణ మాఫీ కాలేదు. దీంతో బ్యాంక్‌లు, వ్యవసాయ అధికారుల దగ్గరికి తిరుగుతున్నారు. అర్హులైన వారందరికీ రుణ మాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

మెదక్– సిద్దిపేట– ఎల్కతుర్తి 765డీజీ జాతీయ రహదారి పనులు రూ.1,500 కోట్లతో నిర్మాణం చేపట్టారు. ఈ పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. పనులు నెమ్మదిగా సాగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కోహెడలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ (ఫైల్)

సంక్షేమ పథకాలు



గృహజ్యోతి పథకం ద్వారా రేషన్ కార్డు ఉన్న వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. కేటగిరి-1లో 3,16,656 సర్వీస్‌లు ఉన్నాయి. అందులో మార్చి నుంచి డిసెంబర్ వరకు 1,95,767 సర్వీస్‌లు 13,86,06,532 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించగా రూ. 58.68కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మహాలక్ష్మి పథకం కింద రూ.500లకు గ్యాస్ సిలిండర్‌ను అందిస్తోంది. ఇప్పటి వరకు 1,63,457 మంది లబ్ధిదారులకు (4,84,963 గ్యాస్ సిలిండర్లు) రూ 14.53కోట్ల లబ్ధి చేకూరింది.

సిద్దిపేటలో బ్రేక్..

హుస్నాబాద్ నియోజకవర్గంలో జెట్ స్పీడ్‌తో నిధులు మంజూరు, అభివృద్ధి పనులు సాగుతున్నాయి. హుస్నాబాద్‌కు ఈ ఏడాదిలో సుమారు రూ.1,000కోట్ల నిధులు మంజూరయ్యాయి. వివిధ పనులకు సంబంధించి టెండర్ దశలో ఉన్నాయి. కోహెడ మండలంలో రూ.150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోగా, మంజూరైన నిధులను సైతం రద్దు చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో సుమారు రూ.875 కోట్ల పనులు మధ్యలో నిలిచిపోయాయి. అదేవిధంగా దుబ్బాక, గజ్వేల్, జనగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి.



సిద్దిపేటలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు

అధికారుల స్టడీ టూర్

స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట మున్సిపాలిటీని రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లు విజిట్ చేశారు. సిద్దిపేట పట్టణంలో తడి చెత్తతో గ్యాస్ తయారీ, సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలించారు. స్వచ్ఛబడిని పరిశీలించి మున్సిపల్ కమిషనర్లు అన్ని విషయాలు తెలుసుకున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఢిల్లీలో సెంటర్ ఫర్ సైన్స్, ఎన్విరాన్మెంట్ వారు చేంజ్‌మేకర్ అవార్డులు జాతీయ స్థాయిలో సిద్దిపేట, హుస్నాబాద్ మున్సిపాలిటీలు సొంతం చేసుకున్నాయి.



సిద్దిపేట మున్సిపాలిటీలో వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు (ఫైల్)

మల్లన్న బండ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మల్లన్న బండ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి-జంగపల్లి శివారులో వెలసిన మల్లన్న బండ ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. మలన్న దేవుడికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా ఏర్పడిన ఆలయ కమిటీ సభ్యులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి యేటా సంక్రాంతి పర్వదినాన మల్లన్న బండపై జరిగే మహా జాతరకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. జిల్లాలో కొమురవెల్లి, కూడవెల్లి జాతర తర్వాత అత్యంత పెద్ద జాతరగా పేరు గాంచిన మల్లన్న బండ జాతర ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో మల్లన్న బండ ఆలయ కమిటీ నూతన చైర్మన్ లింగాల వెంకట్‌రెడ్డి, వీరారెడిపల్లి, జంగపల్లి మాజీ సర్పంచులు కొమ్మాట బాలకృష్ణ, కంచం యాదగిరి, ఆలయ వైదిక నిర్వాహకులు జంగం కొమురయ్య, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, జీడిపల్లి రవి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

న్యూస్‌రీల్

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి అన్నారు. ఆదివారం పట్టణ గ్రంథాలయాన్ని సందర్శించారు. ముందుగా అక్కడి పాఠకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆవరణలో ఉన్న చెత్తను, తొలగించాలని మున్సిపల్ కార్మికులను ఆదేశించారు. లింగమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని పాఠకులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దాసరిరాజు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల కష్ట సుఖాల్లో అండగా ఉంటా

ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీ రఘునందన్‌రావుకు జ్ఞాపిక అందిస్తున్న బీజేపీ నేత బాలేశ్‌గౌడ్

దుబ్బాక: ప్రజల కష్ట సుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి దుబ్బాక పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ నాయకుడు మర్గల సత్యానందంను పరామర్శించి ఆయన ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్, చేర్వాపూర్‌లో మూర్తి రాజేందర్‌రెడ్డిల నూతన గృహప్రవేశాల వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు ఏ ఆపద వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నాచగిరి.. భక్తజన ఝరి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహక్షేత్రం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం తమ ఇలవేల్పును దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. హరిద్రానది వాగులో పుణ్యస్నానాలు చేశారు. అధ్యయనోత్సవాల సందర్భంగా విశేషాలంకరణలో కొలువైన లక్ష్మీసమేత నృసింహస్వామివారిని, ఆళ్వారులను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విశేషాలంకరణలో నృసింహస్వామి, అమ్మవారు

ఏడుపాయలలో భక్తుల సందడి



ఆలయం ఎదుట భక్తుల కోలాహలం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా భవాని మాతను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తన వ్యక్తిగత కార్యదర్శి వివాహ విందుకు మంత్రి హాజరై దీవించారు. ఆదివారం సెలవుదినం కావడంతో సుదూరా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయలకు చేరుకొని దుర్గమాతను దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.



దుర్గమ్మ సన్నిధిలో మంత్రి దామోదర

నీటి సంప్‌లో పడి ఒకరి మృతి

కొండపాక(గజ్వేల్): ప్రమాదవ శాత్తు ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంప్‌లో పడి ఒకరు మృతి చెందారు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌కు చెందిన బూరుగు మల్లేశం (38) శనివారం రాత్రి సంప్‌లోంచి నీళ్లను బయటకు తీస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య సుమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



సిద్దిపేటరూరల్: రెగ్యులరైజ్ చేసి పేస్కేల్ చెల్లించాలని కోరుతూ చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్ని రోజులుగా నిరసనలు చేపడుతున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలకిషన్, కార్యదర్శి నవీన్, రాష్ట్ర కమిటీ నాయకులు కృష్ణవేణి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఖాకీలు.. ఎందుకిలా?

- క్షణికావేశంలో తనువుచాలిస్తున్న పోలీసులు
- మొన్న ఎస్ఐ.. నేడు హెడ్ కానిస్టేబుళ్లు..
- రోజురోజుకు పెరుగుతున్న ఘటనలు

సాక్షి, సిద్దిపేట/మెదక్ జోన్: ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకుంటారు. అక్కడ వారికి న్యాయం జరుగుతుందని భావిస్తారు. అయితే వారిలో మనోధైర్యం నింపాల్సిన పోలీసులే అధైర్యానికి లోనవుతున్నారు. కష్టపడి పోలీస్ కొలువు సాధించి అర్ధంతరంగా తనువుచాలిస్తున్నా రు. నాలుగు రోజుల క్రితం మెదక్‌జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన బిక్కనూర్ ఎస్సై సాయికుమార్ మరణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్‌తో పరిచయాలు చివరకు ఆత్మహత్య చేసుకునే వరకు వెళ్లాయి. ఆ ఘటన మరువకముందే కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే హెడ్‌కానిస్టేబుల్ సాయికుమార్ ఆదివారం స్టేషన్ ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఇందుకు ప్రధాన కారణం వివాహేతర సంబంధమేనని సమాచారం. సాయికుమార్ తనను బెదిరిస్తున్నా డని నర్సాపూర్‌కు చెందిన ఓ వ్యాపారి ఇటీవల స్థానిక సీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తన భార్యతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, ఎందుకు మాట్లాడుతున్నావని అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల కానిస్టేబుల్ తరఫున కొందరు నాయకులు, వ్యాపారి తరఫున బంధువులు చర్చలు జరిపినా విఫలమైనట్లు సమాచారం. రెండో దఫా చర్చలు జరగకముందే సాయికుమార్ ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం. ఏపీలోని బాపట్ల జిల్లా రేపల్లె ప్రాంతానికి చెందిన సాయికుమార్ 1992లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వర్తించాడు. ఆరేళ్ల క్రితం హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది ఎస్‌బీలో కొంతకాలం విధులు నిర్వర్తించి ఇటీవలే సివిల్ విభాగంలోకి వచ్చాడు. అలాగే సిద్దిపేటకు చెందిన బెటాలియన్ కానిస్టేబుల్ బాలకృష్ణ తన భార్యతో పాటు ఇద్దరు పిల్లలకు పురుగు మందు తాగించి ఉరేసుకొని తనువు చాలించాడు. ప్రస్తుతం అతడి భార్యాపిల్లలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కారణాలేమైనా పోలీసుల మరణాలు ఆ శాఖలో కలకలం రేపుతున్నాయి.



కానిస్టేబుల్ సాయికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

మరికొన్ని ఘటనలు..

- 2017లో దుబ్బాక ఎస్ఐ చిట్టిబాబు సర్వీస్ రివాల్వర్‌తో భార్యను చంపి తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- 2016లో గజ్వేల్ నియోజకవర్గం కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఎస్ఐ రామకృష్ణారెడ్డి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. మామూళ్ల విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిడితోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది.
- 2017లో ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి రివాల్వల్‌తో కాల్చుకుని చనిపోయాడు. సెటిల్‌మెంట్లు బయట పడతాయనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.
- 2023లో కలెక్టర్ గన్‌మెన్ కానిస్టేబుల్ నరేష్ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తనువు చాలించాడు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లికి చెందిన మరో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు.

క్లుప్తంగా

మనీ లాండరింగ్ కేసులో ఉన్నావని బెదిరింపులు

- పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్
- రూ.5.79 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: మనీ లాండరింగ్ కేసులో సస్పెక్ట్ గా ఉన్నావని పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని ఫోన్ చేసి ఓ ప్రైవేట్ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి 12వ తేదీన అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ముంబాయి పోలీస్ డిపార్ట్ మెంట్ నుంచి కాల్ చేస్తున్నామని మనీలాండరింగ్ కేసులో మీ పేరు ఉందని చెప్పారు. ఆ పేరు తప్పించాలంటే డబ్బులు ఇవ్వాలని భయ భ్రాంతులకు గురి చేశారు. దీంతో ఆ ఉద్యోగి అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ. 5.79 లక్షలు వేశాడు. అపరిచిత వ్యక్తి మరోసారి డబ్బులు వేయాలని అడగడంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆదివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

సంగారెడ్డి క్రైమ్: ఉరేసుకొని పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. ఆదివారం పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలో వీరభద్రనగర్‌కి చెందిన మచుకూరి వెంకటేశం పెద్ద కూతురు నిఖిత (22) పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతుంది. కొద్ది రోజులుగా ఆమె అనార్యోగ సమస్యలతో బాధపడుతుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై 28వ తేదీన రాత్రి గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నర్సాపూర్ నుంచి ప్రయాణికులతో వస్తున్న టాటా ఏస్ వాహనం స్టీరింగ్ రాడ్ విరగడంతో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఐదు మందికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ వాసులుగా తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి అక్రమ రవాణా

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి చెన్నాపూర్ గ్రామ చెరువులో నుంచి కొద్ది రోజులుగా షేగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతుల అవసరాల నిమిత్తం మట్టి తవ్వకాలు చేస్తున్నామని చెబుతూ రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరేశ్, రాజిరెడ్డి, వెంకటేశ్ ఆరోపించారు. రైతులకు ఉచితంగా మట్టి రవాణా చేస్తామన్న సంస్థ టిప్పర్‌కు రూ.1,000 చొప్పున ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వాపోయారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం మూలంగా చెరువులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయం గురించి షేగల్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సునీల్‌ను వివరణ కోరగా రైతుల అవసరాల నిమిత్తం మేరకు మట్టి తరలింపు చేస్తున్నామని ఉదయం వేళల్లో మట్టి తరలింపు జరుగుతుందని చెప్పారు.

తిలకించి.. పరవశించి

మల్లన్న కల్యాణంలో భక్తుల కోలాహలం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. దీంతో తోటబావి వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక స్వామివారి నామస్మరణతో మార్మోగింది. వేడుకను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయ గర్భగుడిలోనూ మూల విరాట్ కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు.





రాజగోపురం ఎదుట భక్తుల సందడి, (ఇన్‌సెట్‌లో..) అలంకరణలో మల్లికార్జునస్వామి మూలవిరాట్



స్వామివారిని తోటబావి కల్యాణ మండపానికి పల్లకీలో తీసుకొస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న ఎంపీ, ప్రజాప్రతినిధులు, అధికారులు



పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న జోగిని శ్యామల



కల్యాణోత్సవ వేద పర్యవేక్షణకు వస్తున్న జగద్గురు డాక్టర్ మల్లికార్జున



భక్తుల మధ్య జనగాం ఎమ్మెల్యే పల్లా



పల్లకీలో బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మవార్లు



కల్యాణాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న భక్తులు

కవిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ మమ్మల్ని భయపెట్టాలని చూస్తుందని ఎమ్మెల్సీ కవిత అనడం హాస్యాస్పదమని, వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు రఘునందన్ రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పర్యటనలో ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎవరిని భయపెట్టబోదని తెలిపారు. తప్పు చేసిన వారు ఏ కలుగులో ఉన్నా దర్యాప్తు సంస్థలు పట్టుకొస్తాయన్నారు. జైలు కి వెళ్లి వచ్చిన కవిత తీరులో ఇంకా మార్పు రాలేదన్నారు. కేంద్రం భయపెట్టాలని అనుకుంటే మాజీ సీఎం కేసీఆర్ నే అరెస్టు చేసేవారమన్నారు. బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీ లో కులగణన చేయాలని కవిత మాట్లాడడం సిగ్గు చేటన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి బీసీలకు రెండు మంత్రి పదవులు ఇవ్వని మీరు బీసీల గురుంచి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఒక బీసీ బిడ్డ కు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కారుల ఉసురుపోసుకున్న ఘనమైన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే, మాణిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎంపీ రఘునందన్‌రావు

పంటలను పక్కనపెట్టి..

హైదరాబాద్‌కు నీళ్లా?

- మల్లన్నసాగర్‌లో నీళ్లున్నా వినియోగించుకోలేని స్థితిలో సర్కార్
- యాసంగి పంటలకు నీళ్లు అందించాల్సిందే..
- ఎన్నిసార్లు మంత్రులకు చెప్పినా పట్టించుకోవడం లేదు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం
- ప్రధాన కాల్వ పరిశీలన

దుబ్బాక : పంటలకు నీళ్లందించే కాల్వ పనులను పక్కన బెట్టి హైదరాబాద్‌కు నీళ్ల తీసుకుపోయే పనులను చేపట్టడడం చూస్తుంటూనే కాంగ్రెస్ సర్కార్‌కు రైతుల మీద ఏపాటి ప్రేమ ఉందో తేటతెల్లమవుతుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మల్లన్నసాగర్ ప్రాజెక్టు పరిధిలోని పంటలకు నీరందించే దుబ్బాక ప్రధాన కాల్వ ను పరిశీలించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన కాల్వ నిర్మాణం విషయంలో అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తలాపునే మల్లన్నసాగర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నా రైతులకు నీరందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రధానమైన మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు పూర్తి చేయడం జరిగిందని తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాల్వల నిర్మాణాలు పూర్తి చేసి పంటలకు నీళ్లందించే వాళ్లమన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్‌ల నుంచి ప్రతీ ఎకరాకు సాగునీరందించేలా భూసేకరణ చేసి, కోర్టు కేసులు పరిష్కరించి కాల్వలు పూర్తి చేయాలని ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అసెంబ్లీలో చర్చించినా, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదన్నారు. రాజకీయాలు పక్కనబెట్టి రైతుల హితమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న సాగర్ ప్రధాన కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చికిత్స పొందుతూ యువకుడు మృతి



యుగేంధర్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాములు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల యుగేంధర్ (30) ఇంటి నిర్మాణాలకు పెయింటింగ్ వేస్తూ పనులు చేసుకునేవాడు. మూడేళ్ల కిందట భార్యతో విడిపోయి గ్రామంలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. చాలా కాలంగా యుగేంధర్ తాగుడుకు బానిసయ్యాడు. 27న తాగిన మైకంలో ఇంటి చుట్టు పక్కల వారితో గొడవ పడ్డాడు. అదే మత్తులో ఇంట్లోకి వెళ్లి గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యుగేంధర్ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పట్టుబడిన వారితో పోలీసులు

తొగుట(దుబ్బాక): సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, తొగుట పోలీసులు దాడి చేసి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేటలో ఆదివారం చోటు చేసుకుంది. తొగుట పోలీసుల కథనం మేరకు.. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తొగుట పోలీసులు కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన నర్శెళ్ల చంద్రారెడ్డి, నర్మెట నారాయణ, నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, బూర శ్రీనివాస్ గౌడ్, నందవరం వెంకటేశ్‌గౌడ్, చిట్టి కరుణాకర్‌ను అరెస్ట్ చేసి రూ.20,560 నగదు, నాలుగు సెల్ ఫోన్లు, 5 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తొగుట పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసున మోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుప్పుమంటున్న గంజాయి

- విక్రయాలకు అడ్డగా మారిన చిన్నశంకరంపేట
- పారిశ్రామికంగా రోజురోజుకూ విస్తరణ
- నెల వ్యవధిలో మూడు కేసులు నమోదు
- గంజాయి స్వాధీనం, పలువురు అరెస్ట్
- వలస కార్మికులే ఎక్కువ
- మరింత నిఘా అవసరం

చిన్నశంకరంపేట(మెదక్): పారిశ్రామికంగా విస్తరిస్తున్న చిన్నశంకరంపేట మండల కేంద్రం గంజాయి విక్రయాలకు అడ్డగా మారుతోంది. నెల రోజుల్లోనే గంజాయి విక్రయాలు చేస్తున్న వలస కార్మికులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మత్తు పదార్థం స్వాధీనం చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది.

చిన్నశంకరం పేట మండలంలోని మిర్జాపల్లి రోడ్డులో పలు రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడి పరిశ్రమల్లో ఇతర రాష్ట్రాలనుంచి కూలీలు వచ్చి పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో కార్మికులు మత్తు పదార్థాలకు అలవాటు వారు సేవించడమే కాకుండా స్థానికంగా విక్రయాలు జరుపుతున్నారు. శనివారం రామాయంపేట ఎక్సైజ్ అధికారులు మాటువేసి గంజాయి విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రాజేశ్ జౌతలీని అదుపులోకి తీసుకొని 190 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇదే నెలలో స్థానిక స్టీల్ పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేసే సూరజ్ కుమార్ బిహార్ నుంచి పెద్ద మొత్తంలో గంజాయి తీసుకొచ్చి తోటి కార్మికులకు విక్రయిస్తు పట్టుబడ్డాడు. నెల రోజుల పాటు విక్రయాలు చేస్తూ 512 గ్రాముల గంజాయితో స్టీల్ పరిశ్రమ సమీపంలో పోలీస్‌లకు పట్టుబడ్డాడు. ఇదే నెలలో ఇదే స్టీల్ పరిశ్రమలో పనిచేసే మరో ఇద్దరు కార్మికులు గంజాయిని కొనుగోలు చేయగా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డారు. వరుసగా నెల రోజుల వ్యవధిలోనే మెదక్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు, రామాయంపేట ఎక్సైజ్ అధికారులు, చిన్నశంకరంపేట పోలీస్‌లు వేరు వేరుగా దాడులు నిర్వహించి గంజాయి విక్రేతలను అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని స్టీల్ పరిశ్రమల వద్ద భారీగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తేలింది.



గంజాయి విక్రేతను పట్టుకున్న పోలీసులు

కమిటీల ఏర్పాటు అవసరం

చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని స్టీల్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు వరుస ఘటనలతో అర్థం అవుతుంది. పోలీస్, ఎక్సైజ్ అధికారులు మరింత నిఘా పెట్టినట్లైతే మరికొంత మంది పట్టుబడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. పరిశ్రమల వద్ద నిర్వహించే హోటళ్లు, సిగరేట్లు, చాక్లెట్లు పరిశీలించాలని చెబుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై కళాశాలల్లో, గ్రామాల్లో యాంటీడ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేస్తున్నా పోలీస్ అధికారులు మరింత నిఘాను పెంచాల్సిన అవసరం ఉంది.

డ్రమ్ సీడర్ సాగు.. భలే బాగు




డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగు చేస్తున్న రైతులు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- కూలీల సమస్య అధిగమించే అవకాశం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సాధారణంగా వరి పంట సాగుకు నారు పోసి నాటు వేసుకోవాలి. ఇది చాలా ఖర్చుతోపాటు, కూలీల సమస్యను వేధిస్తుంటుంది. కూలీలు దొరకక సాగులో ఆలస్యమైతే అదును దాటి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తే రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుంది. ప్రధానంగా వరి సాగులో డ్రమ్ సీడర్‌తో నేరుగా వరి విత్తనం విత్తే పద్ధతిని పాటిస్తే సమస్యలన్నింటిని అధిగమించొచ్చని వ్యవసాయధికారులు సూచిస్తున్నారు.

- డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి రకాన్ని బట్టి ఎకరాకు 10 నుంచి 15 కిలోలు అవసరమవుతాయి.
- పొలంలో నీరు నిల్వ ఉండకూడదు. నీరు ఎక్కువైతే బయటకు పోవడానికి ఏర్పాట్లు చేయాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా చదును చేయాలి. నీరు పెట్టడానికి, విత్తనం విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.
- విత్తే సమయానికి నీరు లేకుండా చూసుకోవాలి. ఇసుక నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి మొలక వచ్చిన విత్తనాలను విత్తుకోవాలి.
- డ్రమ్ సీడర్ పద్ధతిలో ఒక ఎకరం విత్తనానికి ఇద్దరు కూలీలు అవసరమవుతారు.
- లీటర్ నీటికి గ్రాము చొప్పున కార్బాండిజిమ్ కలిపి విత్తనాలు 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి కొద్దిగా కొమ్ము పలిగిన గింజలను డ్రమ్ సీడర్ ద్వారా విత్తుకోవచ్చు.
- నారుమడిలో నీటి యాజమాన్య ఏ విధంగా చేస్తామో, వరి మొదటి దశలో అదే పద్ధతిలో అవలంభించాలి.
- అనివార్య కారణాలతో కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్న మిగిలిన 50 శాతం గింజల నుంచి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది.
- సన్నగింజ రకాలకు రంధ్రం వదిలి మరో రంధ్రాన్ని మూసి వేయాలి. ప్రతీ 16 వరుసలకు అడుగు వెడల్పు కాలి బాటలు ఉంచుకోవాలి.
- తాడు వాడి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. సాధారణ సాగు కన్న ఈ పద్ధతిలో పంట దిగుబడి అధనంగా వస్తుంది. సాళ్లల్లో కోనో వీడర్ ద్వారా కలుపు తీస్తే ఈ కలుపు పంటకు పట్టి ఎరువవుతుంది.
- విత్తిన తర్వాత పంట కాలంలో రెండు నుంచి మూడు సార్లు కోనో వీవర్ తిప్పితే అధిక పంట దిగుబడి వస్తుంది.

లాభాలు అధికం



డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలు నేరుగా విత్తుకుంటే కూలీల సమస్య ఉండదు. పంట సాగు పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి పొందవచ్చు. ఈ పద్ధతి ద్వారా రైతులకు లాభాలు అధికం. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు అందిస్తాం. ఈ విధానంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జయంత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి

డైరీ.. జ్ఞాపకాల పందిరి



వెల్దుర్తి(తూప్రాన్) : మన జీవితం అడుగుజాడలను డైరీ పదిలపరుస్తుంది. గోడ మీద క్యాలెండర్ ప్రతీ సంవత్సరం మారిపోతుంది. కానీ 365 రోజులు మనతోనే గడిపిన డైరీ 2024 సంవత్సరంలోని ఆలోచన, అక్షరాలను మనముందు కొత్త సంవత్సరానికి ప్రొగ్రెస్ రిపోర్ట్ అందిస్తుంది. మనం పాత సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సంకల్పాలు, సాధించిన విజయాలు, ఓటములు, ఆగిపోయిన సంకల్పాలు మరోసారి గుర్తు చేస్తాయి.

- తరతరాలకు గుర్తుండే విషయాలు
- స్నేహితులకు, బంధువులకు గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు
- గుర్తించుకునే రాతలు రాయొచ్చు
- గడిచిన కాలానికి ప్రొగ్రెస్ రిపోర్ట్
- చెరిగిపోకుండా కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ లాంటి డైరీలు

అక్షరాలను ఇలా మొదలు పెడదాం..

మార్కెట్లోకి అందమైన రంగురంగుల డైరీలు వచ్చాయి. స్టేషనరీ దుకాణాల నుంచి ఇష్టమైన రంగులతో మీకు అనువైన సైజుల్లో ఉండే డైరీని కొనుగోలు చేయాలి. ఆ డైరీ మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలాగా ఉండాలి. డైరీ రాయడానికి ప్రతిరోజూ ఒక నిర్దిష్టమైన సమయాన్ని ఏర్పాటు చేసుకోవడం మంచిది. చాలా మంది ఏం రాయాలో తోచక ప్రారంభించిన వారం రోజులకే ముగిస్తారు. కొందరు చిట్టా పద్దులు, వడ్డీ లెక్కలకు డైరీలను పరిమితం చేస్తారు. డైరీలో ప్రతిరోజూ ఎక్కడ ఉన్నారు? ఏ సమయంలో ఉన్నారు? మీకు కలిగిన అనుభూతులు రాసుకోవాలి. డైరీలను మన జీవన ప్రయాణానికి దిక్సూచిగా భావించి భద్రపరచుకోవాలి.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం...

పాఠశాలలో విద్యార్థులకు హోం వర్క్ డైరీలు ఉపయోగపడుతుంటే కళాశాల విద్యార్థులు తమ స్నేహితుల గురించి, స్ఫూర్తినిచ్చిన ఉపాధ్యాయుల గురించి రాసుకోవచ్చు. కళాశాలలో జరిగే సరదా సంఘటనలు రాసుకోవాలి. గతేడాది విఫలమైన అంశాలను రాసుకొని ఈ ఏడాది లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. యువతీ, యువకులు ప్రధానంగా తమ ల క్ష్యాలు, సాకారమైన కలలను డైరీలో రాసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..

ఒకరి డైరీని మరొకరు చదవడం సభ్యత కాదని, కుటుంబ సమస్యలతోపాటు సమాజం అంగీకరిస్తున్న వాస్తవం. కానీ ఆ విషయాలను మరిచి కొందరు చదవడానికి ప్రయత్నిస్తారు. డైరీని జాగ్రత్తగా పెట్టుకోవడం మంచిది. డైరీ వ్యక్తిగతమని, ఎవరూ చదవద్దని హెచ్చరించవచ్చు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల గురించి నెగిటివ్ విషయాలు డైరీలో రాయకపోవడం మంచిది. భవిష్యత్‌లో గొడవలు వచ్చే అవకాశాలు కూడా లేకపోలేదు. ఎవరికి డైరీ దొరికినా చదవకుండా వాళ్లకు అందించాలి.



కాలం చెల్లని ఈ–డైరీలు

ఆధునిక సాంకేతిక అవసరాలు పెరిగిన తర్వాత ఇంటర్నెట్లో లభించే ఈ డైరీపై ఆసక్తి చూపుతున్నారు. ఎలాంటి వ్యయ ప్రయాసలకు ఇబ్బంది లేకుండా, సురక్షితంగా ఈ–డైరీ ఉపయోగపడుతుంది. పాత బడడం, చిరిగిపోయే సమస్యలు ఉండకపోవడంతో కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్‌లను ఉపయోగించి ఈ–డైరీ రాసుకునే సదుపాయాన్ని ఉపయోగించుకుంటున్నారు. అంతేకాకుండా పాస్‌వర్డ్ ద్వారా మరొకరు డైరీని చదివే వీలు ఉండదు.